క్లుప్తంగా

ఎంపీటీసీని పరామర్శించిన జోగులు



చంద్రరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

నక్కపల్లి: అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు లొడగల చంద్రరావును పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం పరామర్శించారు. చంద్రరావుకు గుండెపోటు రావడంతో ఇటీవల విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. డీఎల్‌పురంలో తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన జోగులు సోమవారం అతడిని కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నక్కపల్లి, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, ఎం దేవుళ్లు, శివ పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడి లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్రస్థాయి కార్యకర్త రమ్య

మునగపాక: బాల్య వివాహాలను అరికట్టేలా చూడాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్ర స్థాయి కార్యకర్త రమ్య కోరారు. మండలంలోని కాకరాపల్లిలో 11 మంది బాలల సంరక్షణ కమిటీ సభ్యులను సోమవారం ఎంపిక చేశారు. ఆమె మాట్లాడుతూ బాలికలపై వేధింపులు పెరిగిపోతున్నాయని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకోవడం విచారకరమన్నారు. ఇందుకోసం నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు బాధ్యతగా పని చేయాలన్నారు. సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు, కార్యదర్శి రాజుబాబు, వీఆర్వో కోటేశ్వరరావు, ఏఎన్‌ఎం జ్యోతి, మహిళా పోలీసు జ్యోతిర్మయి పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

మునగపాక: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం అనకాపల్లి ఆర్డీవో అయిషా సందర్శించారు. పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి చేపట్టనున్న పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలన్నారు. బాధితుల వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు సూచించారు.

పెండింగ్ ఈకేవైసీపై దృష్టి సారించాలి

మునగపాక: పెండింగ్ ఈకేవైసీపై దృష్టి సారించాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సాయంత్రం రేషన్ డిపో డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు సాంకేతిక కారణాల వల్ల ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నందున వినియోగదారునికి సమాచారం ఇచ్చి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ చేయించుకోలేని వారికి రేషన్ నిలుపుదల చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం పలు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్‌లో చెట్టుకొమ్మలు తొలగింపు ఉన్నందున సర్వసిద్ధి, వెంకటాపురం, ఉప్పరాపల్లి, వాకపాడు, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం, బసవపాడు, పేటసూధిపురం సైతారుపేట, జేవీపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

నలుగురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై కేసు

యలమంచిలి రూరల్: డబ్బు కోసం కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్‌ను అడ్డగించి, డ్రైవర్ మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొనిపోయిన నలుగురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి సీఐ ధనుంజయరావు తెలిపారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశాఖ సిటీలోని ట్రూత్ న్యూస్ చానల్‌లో పనిచేస్తున్న చప్పా మోహన్‌కృష్ణ, బంగారి భరత్, యండ్రపల్లి తిరుపతి, వానపల్లి శ్రీనివాసు ఆదివారం సాయంత్రం యలమంచిలి మండలం లైనుకొత్తూరు వద్ద వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించిన విషయం తెలిసిందే. దీనిపై కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఏ మల్లవరం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పోలవర్తి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వీరి నుంచి మొబైల్ ఫోన్, ఐడీ కార్డులు, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నెరవేరని ఇంటర్ కళాశాల



పదో తరగతి తర్వాత ఎవరైనా ఇక్కడ ఉన్నత చదువులు కొనుక్కోవాల్సిందే.. ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలే దిక్కవుతున్నాయి. దీంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరమయ్యే దుస్థితి నెలకొంది. మునగపాక మండలంలో ఒక్కటైనా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. ఈ విషయంలో కూటమి పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

గత ప్రభుత్వంలో రెండు హైస్కూళ్ల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు

వాటిని పక్కన పెట్టేసిన కూటమి ప్రభుత్వం

ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే..

మునగపాక విద్యార్థులకు తప్పని వ్యయప్రయాసలు

మునగపాక: ఇంటర్మీడియట్ **జూనియర్ కళాశాలల** ఏర్పాటుపై మునగపాక **విద్యార్థులు కన్న కలలన్నీ** తలకిందులయ్యాయి. గత **వైఎస్సార్‌సీపీ హయాం**లో తోటాడ, మునగపాకలో **హైస్కూళ్లను కళాశాల**లుగా అప్‌గ్రేడ్ చేయడానికి **ప్రతిపాదనలు చేశారు.** ఇంతలో సార్వత్రిక ఎన్నిక**లు వచ్చి** కూటమి అధికారంలోకి రా**వడం**తో అవి కార్యరూపం దాల్చ లేదు. దాంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎప్పటి మాదిరిగానే సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు.

పదితో ఆగిపోతున్న చదువు

మండలంలోని ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు పాటిపల్లి మోడల్ స్కూల్, పాటిపల్లి కేజీబీవీ ఉన్నాయి. మునగపాక, నాగులాపల్లి, గణపర్తి, తిమ్మరాజుపేట, తోటాడ, వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్ల నుంచి ప్రతీ సంవత్సరం 450 మందికి తక్కువ కాకుండా పది పరీక్షలు రాస్తున్నారు. పది తర్వాత చదువుకుందామంటే స్థానికంగా జూనియర్ కళాశాల లేకపోవడంతో పలువురు విద్యార్థులు అక్కడితో ఆగిపోతున్నారు.

వ్యయ ప్రయాసలకోర్చి చదువులతో అవస్థలు....

పది తర్వాత ఇంటర్ చదువుకునేందుకు స్థానికంగా జూనియర్ కళాశాల లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. గాజువాక, అనకాపల్లి, యలమంచిలి తదితర ప్రాంతాలకు వ్యయ ప్రయాసాలకోర్చి చదువుకునేందుకు అవస్థలు పడుతున్నారు. నిత్యం మునగపాక నుంచి బస్సులు, ఆటోలపై వెళ్లి కొంతమంది ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్నారు. బాలికలను సుదూర ప్రాంతాలకు పంపి చదివించేందుకు తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇంటి నుంచి బయలు దేరిన బాలిక సాయంత్రం ఇంటికి వచ్చేంత వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితుల నేపథ్యంలో వారు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

73 సంవత్సరాలుగా నెరవేరని కల...

మునగపాకలో జూనియర్ కళాశాల చదువులు అందని ద్రాక్షగా మారాయి. మునగపాకలో 1952లో జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు సుమారు 73 సంవత్సరాలు కావస్తున్నా, ఇంతవరకు జూనియర్ కళాశాలకు నోచుకోలేదు. మునగపాక హైస్కూల్‌లో ఇంటర్ చదువులకు అవసరమయ్యే వసతి సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. మండల కేంద్రానికి వచ్చి ఇంటర్ **చదువుకునేందుకు ఆసక్తి** చూపుతున్నా, స్థానికం**గా కళాశాల ఏర్పాటు చేయ**కపోవడంతో కల నెర**వేరకుండా పోతుందని వా**పోతున్నారు. ప్రస్తుత **పరిస్థితుల్లో జూనియర్** కళాశాల ఆవశ్యకత **ఉన్నా, పాలకులు ఎందుకో** ముందుకు రావడం **లేదన్న ఆరోపణలు ఉన్నా**యి. గత వైఎస్సార్‌సీపీ **హయాంలో మండలానికి** రెండు కళాశాలలు మంజూరుకు ప్రతిపాదనలు చేశారు. మునగపాక హైస్కూల్‌లో బాలికలకు, తోటాడ హైస్కూల్‌లో బాలురకు జూనియర్ కళాశాల చదువుల కోసం ప్రతిపాదనలు చేసినా తర్వాత సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ఈ కల నెరవేరలేదు.

ఇబ్బందులతో చదువుకోవడం కష్టం



మునగపాకలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. పది తర్వాత ఇంటర్ చదువుకునేందుకు అనువుగా జూనియర్ కళాశాల లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలి, ఇబ్బందులతో చదువుకోవడం కష్టతరం. పాలకులు, అధికారులు దృష్టి సారించి మునగపాకలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

బొడ్డేడ మహిషా మహాలక్ష్మి, పదో తరగతి విద్యార్థిని, గవర్ల అనకాపల్లి

కళాశాల మంజూరు చేయాలి



ఏళ్లు గడుస్తున్నా మునగపాకలో జూనియర్ కళాశాల అందుబాటులోకి రాకపోవడం బాధాకరం. పది తర్వాత ఇంటర్ చదువుకునేందుకు సౌకర్యాలు స్థానికంగా ఉన్నా కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. మునగపాక హైస్కూల్‌లో పూర్తిస్థాయి వసతులున్న నేపథ్యంలో జూనియర్ కళాశాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

– కాండ్రేగుల జగన్, పూర్వ విద్యార్థి, తిమ్మరాజుపేట

కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఉంది



ఏటా పదో తరగతిలో మంచి ఫలితాలు వస్తున్నాయి. పది తర్వాత చదువుకునేందుకు ఇంటర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. మునగపాక హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ఎంతోమంది విద్యార్థులు ఇంటర్ చదువుకునే పరిస్థితులు లేకపోలేదు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఉంది.

– వేణుగోపాలరావు, ఎంఈవో

సర్పంచ్‌ను పరామర్శించిన పార్టీ నాయకులు



ఖాజీపాలెం సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మండల నాయకులు

అచ్యుతాపురం: మండలంలోని ఖాజీపాలెం సర్పంచ్ పీలా నర్సింగరావును వైఎస్సార్ సీపీ మండల నాయకులు సోమవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన చిన్న ప్రమాదంలో సర్పంచ్ నర్సింగరావు కాలికి గాయమైంది. ఈ మేరకు అతడిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్ రావు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, జగ్గన్నపేటకు చెందిన దొడ్డి కృష్ణ, పంచదార్ల పైడిరాజు, గొర్లె నూకరాజు, సియాద్రి బుజ్జి, బల్లిరెడ్డి శ్రీను, మండల యూత్ కమిటీ అధ్యక్షుడు కారుకుండి గంగాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలం ఆక్రమిస్తే చర్యలు



రోడ్డు ఆక్రమణలు పరిశీలిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని పాయకరావుపేట ఆర్‌అండ్‌బీ జేఈ జ్ఞానేశ్వరరావు హెచ్చరించారు. కొరుప్రోలు గ్రామం మీదుగా రేవుపోలవరం వెళ్లే రోడ్డులో విచ్చలవిడిగా ఆక్రమణలు చేసి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారని ఫిర్యాదు అందడంతో వాటిని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయన్నారు. అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం, దార్లపూడి నుంచి అడ్డురోడ్డు, చినగుమ్ములూరు నుంచి పెట్టుగొల్లపల్లి వెళ్లే రోడ్లు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. రోడ్డు హద్దులు సర్వే చేయించి ఆక్రమణదారులకు నోటీసులిచ్చి ఖాళీ చేయిస్తామన్నారు. మండల సర్వేయర్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, వీఆర్వో మురళీకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో మెరుగైన దిగుబడులు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పొద్దు తిరుగుడులో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి తెలిపారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం తిమ్మరాజుపేటలో భారత ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా పొద్దు తిరుగుడు పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధిక దిగుబడులకు గాను రైతులు తప్పనిసరిగా అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ విత్తన శుద్ధి, భూసార పరీక్షలు చేసుకుంటే పొద్దు తిరుగుడులో ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. నూనె గింజల పంటల్లో అధిక దిగుబడులకు, ఖర్చు తగ్గించేందుకు యంత్రాల వినియోగం అవసరమన్నారు. వీఏఏ శ్వేత, అభ్యుదయ రైతులు మళ్ల సంజీవరావు, శరగడం గోవింద తులసీరావు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

మునగపాక: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కూలీలు ఆందోళనకు దిగారు. సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ ఏడు వారాలుగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందలేదన్నారు. పనిచేసే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. కూలీలకు ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించలేదన్నారు. గాజుపెంకులు, మురుగునీటిలో ఇబ్బందికర పరిస్థితుల నడుమ పనులు చేస్తున్నా సకాలంలో వేతనాలు అందించకపోవడం విచారకరమన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు అందించేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఉషారాణికి వినతి అందజేశారు. వేగి శివ, దాడి భాస్కరరావు, గోవింద, చిన సూరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి ప్రసాద్

అనకాపల్లి టౌన్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్‌తో మే 2వ తేదీ నుంచి ధర్నా కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిప్రసాద్ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కనీస వేతనాలు లేక, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, కోశాధికారి పీవీ శ్రీనివాసరావు, నరసింగరావు, శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువు, కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు

చెరువు, కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామం వద్ద చెరువులు, కాలువలను సిమెంట్ పరిశ్రమ ఆక్రమించి సర్వీసు రోడ్డు, వంతెన నిర్మాణాలు చేసిందని, వీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతు బుద్ద వెంకటరమణ సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. గైరమ్మ చెరువులో దాదాపు పదడుగుల మేర ఆక్రమించి సర్వీసు రోడ్డు, కిత్తయ్య చెరువు ఆక్రమించి వంతెన నిర్మించారని అందులో పేర్కొన్నారు. మామిడివాక గెడ్డ నుంచి చెరువుకు నీరు వచ్చే కాలువను ఆక్రమించడం వల్ల ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని వాపోయారు. సర్వీసు రోడ్డుతోపాటు ఇతర ఆక్రమణలు తొలగించాలన్నారు. ఈ ఆక్రమణలపై సర్వే చేశారని, దాని నివేదికను ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో కార్మికులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 59వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు మద్దతుగా రాష్ట్ర స్థాయిలో రెండు రోజులు పాటు 129 డిపోలలో రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయని ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి వి. అప్పారావు తెలిపారు. తక్షణమే కండక్టర్, డ్రైవర్‌లపై అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. జోనల్ జాయింట్ కార్యదర్శి జి. శంకర్రావు, రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్, డిపో అధ్యక్ష, కార్యదర్శి ఎస్. రావు, కె.ఎన్.వి. రమేష్, కె. గంగాధరం, ఎస్.ఎస్. మూర్తి పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం



శిక్షణ తరగతుల్ని ప్రారంభిస్తున్న దృశ్యం



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు ప్రసాదరావు

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులు ఏర్పాటు చేసినట్లు గ్రంథపాలకుడు వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు. ఎంఈవో కేవీఎస్ గాంధీ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ 40 రోజులు జరుగుతుందని, విద్యార్థులందరూ రోజూ గ్రంథాలయానికి వచ్చి విశ్రాంత ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు నేర్చుకుని, గేమ్స్, యోగా, క్విజ్‌తో పాటు చక్కగా చదువుకుని క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సీతారామయ్య, యోగా గురువు ప్రసాద్, వై.అచ్యుతరావు, తెలుగు ఉపాధ్యాయులు తేజోమతుల వెంకటేశ్వరరావు పలు అంశాలపై తర్ఫీదు ఇస్తారని లక్ష్మణ్‌రావు తెలిపారు.

అచ్యుతాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్ని డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిక్షణ తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మునగపాక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

వేసవిలో ఖాళీగా ఉండకుండా విద్యార్థులు చదువుకోవాలని సూచించారు. బంగారు నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సందర్శన మంచి అలవాటు

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయుడు జె.వి.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గ్రంథాలయ సందర్శన ద్వారా పుస్తక పఠనంతో ఆత్మవిశ్వాసం పెంపొందడమే కాకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండచ్చన్నారు. ఇక్కడే మంచి స్నేహితులు, మంచి పుస్తకాలు పరిచయమవుతాయన్నారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, ఉపాధ్యాయుడు ప్రకాష్, మాజీ సర్పంచ్ మాణిక్యం పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

మునగపాక: విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి రమణ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా సమీపంలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా మేధా శక్తిని పెంచుకోవచ్చన్నారు. గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చందనోత్సవానికి సన్నాహాలు

కశింకోట: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం చందనోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఏటా వైశాఖ శుద్ధ తదియ రోజు ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి పూసి ఉన్న చందనాన్ని తొలగించి నిజ రూప దర్శనాన్ని మధ్యాహ్నం ఒంటిగంట వరకు కల్పించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. ఈ సందర్భంగా సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, చెరకు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. నిర్ణీత సమయం ముగిశాక స్వామికి చందనాన్ని పూసి మళ్లీ పూజలు చేస్తామన్నారు. ప్రసాద వితరణ జరుపుతామన్నారు.

మాజీ సైనికుల కొవ్వొత్తుల ర్యాలీ



నాలుగు రోడ్ల జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

అనకాపల్లి టౌన్: పాకిస్తాన్‌ని మూడు ముక్కలు చేసి మ్యాప్‌లో లేకుండా చేస్తామని అనకాపల్లి మాజీ సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల హనుమంతరావు తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో 50 మంది మాజీ సైనికులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో డిఫెన్స్ వ్యవస్థ చాలా పటిష్టంగా ఉందన్నారు. యుద్ధం వస్తే పాక్ పుట్టగతులు లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో కొణతాల రత్నకుమారి, వై సోనీ, మంజుల, నారిపల్లి సత్యారావు, సందపర్తి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



పదిలో ప్రగతి సాధించిన విద్యార్థులకు సత్కారం

చోడవరం రూరల్: విద్యార్థులు ఉత్తమ ప్రతిభలో అటు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంఈవోలు బి.పడాలదాస్, కె.సింహాచలం అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. మండలంలోని 16 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండలంలో పది ఫలితాలలో సాధించిన ఉత్తీర్ణత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పదిలో సాధించిన విజయం స్ఫూర్తిగా విద్యార్థులు తమ భవిష్యత్‌లో ఉన్నత విద్యలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com